క్లుప్తంగా

తీరిన తాగునీటి సమస్య

ఓజిలి: ఓజిలిలోని ముస్లిం కాలనీలో కొద్దిరోజులుగా నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. సర్పంచ్ గోవిందయ్య, ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బారావుయాదవ్ తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేశారు. 25 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ముస్లిం కాలనీ వాసులు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్, పంచాయతీ కార్యదర్శి సిరాజ్ బాషా పైపులైను మరమ్మతులు చేయించి కాలనీ వాసులకు తాగునీటిని అందించారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించండి

వెంకటగిరి రూరల్ : వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా అవగాహన కల్పించాలని వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. ఆమె శనివారం పోలీసులు, న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ చాలామంది చిన్న చిన్న వివాదాలకే ఆవేశానికి లోనై కేసులు పెడుతున్నారని తెలిపారు. వెంకటగిరి సీఐ వెంకటరమణ, న్యాయవాదులు బాబ్జి, గాంధీ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతివారమూ క్విజ్ పోటీలు

కలువాయి: కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రతివారమూ క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని హెచ్ఎం అబ్బాస్ అలీ తెలిపారు. పాఠశాల సోషియల్ టీచర్ లక్ష్మీ నారాయణ పోటీలు నిర్వహించి సొంత నిధులతో బహుమతులు అందజేస్తున్నట్టు తెలిపారు. పోటీలతో విద్యార్థుల మధ్య పోటీ వాతావరణం పెరిగి విద్యలో రాణిస్తారని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

నాయుడుపేట టౌన్ : మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమానులు, ప్రిన్సిపాళ్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో మునిరత్నం హెచ్చరించారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో పాఠశాలలను మూసివేయాలని పేర్కొన్నారు. ఎవరైనా తరగతులు నిర్వహిస్తే ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు చేపడతామని వెల్లడించారు.

ఓపెన్ స్కూల్‌లో మళ్లీ చదువుకునే అవకాశం

దొరవారిసత్రం : ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ ద్వారా మళ్లీ చదువుకునే అవకాశం ఉందని ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. ఆయన శనివారం స్థానిక ఎమ్మార్సీలో ఓపెన్ స్కూల్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారు, మధ్యలో చదువు మానేసిన వారు మళ్లీ చదువు కొనసాగించే విధంగా ఓపెన్ స్కూల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

సీఐకి సన్మానం

సైదాపురం : సైదాపురం వచ్చిన రాపూరు సీఐ విజయకృష్ణ, సైదాపురం ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన క్రాంతికుమార్‌ను శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, సొసైటీ అధ్యక్షుడు కె.మోహన్‌రావు, శివకుమార్, ఉప సర్పంచ్ శివ మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ నేతలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు.

మద్యం విక్రేత అరెస్టు

తడ: బైక్‌పై మద్యం బాటిళ్లు పెట్టుకుని బహిరంగంగా విక్రయిస్తున్న వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ పి.నరసింహారావు కథనం మేరకు.. మాంబట్టు పారిశ్రామికవాడలో బైక్‌పై మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు ఏఎస్ఐ వి.రాఘవయ్య దాడులు చేసినట్టు తెలిపారు. కాదలూరుకు చెందిన పాల మునిశేఖర్ తన బైక్‌పై మద్యం బాటిళ్లు ఉంచుకుని ఉద్యోగులకు అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

సీఐ బాధ్యతల స్వీకరణ

గూడూరు రూరల్ : గూడూరు టూటౌన్ సీఐగా శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



నాయుడుపేట టౌన్: అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు శనివారం రాత్రి తెలిపారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ఈ నెల 21న గుర్తు తెలియని వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. అతను శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

నాయుడుపేట టౌన్ : మండలంలోని కూచివాడలో సర్వే నంబరు 140లో స్వర్ణముఖీ నది పోరంబోకు భూమిని ఎవరూ సాగు చేయరాదని తహసీల్దారు గీతావాణి హెచ్చరించారు. ఆమె శనివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి కూచివాడలోని స్వర్ణముఖీ నది పోరంబోకు భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

భద్రత కల్పించాలి



ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని ఈ లోకంలోకి తీసుకువచ్చేందుకు రాత్రీ, పగలు అనే తేడా లేకుండా సేవలు అందించే మహిళా వైద్యులు, నర్సులకు ప్రభుత్వం భద్రత కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిఘా వ్యవస్థను అధికం చేసి వారికి రక్షణ కల్పించాలి. పెద్దగా ఉండే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చెక్ పాయింట్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేసి పంపాలి. చిన్నపాటి పీహెచ్‌సీలలో రాత్రి సమయాల్లో ఒక సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రైవేటు వైద్యుడు, శ్రీదర్శిని హాస్పటల్, కోట



ఆస్పత్రుల్లో నిఘా పెంచాలి



మహిళలను గౌరవించాలని ప్రతి చోటా చెబుతుంటాము. దాన్ని పాటించిన నాడే దేశంలో స్త్రీ పూజించినట్లు. రక్త మోడుతున్న వారిని అక్కున చేర్చుకుని ప్రాణాలు నిలబెట్టేందుకు మహిళా వైద్యులు, నర్సులు ఎంతగానో పాటు పడుతుంటారు. అలాంటి వారిపై మానవ మృగాలు హింసకు గురిచేయడం దారుణం. ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలి. అఘాయిత్యాలకు పాల్పడిన వారిని బహిరంగా శిక్షించేలా చట్టాలు తీసుకురావాలి.

– డాక్టర్ చంద్రహాస్, విశ్రాంత ప్రభుత్వ వైద్యులు, గూడూరు

బస్సులు నడపండి సారూ..!

పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపడం లేదు. దీంతో ఉదయం పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు సమయానికి తరగతులకు వెళ్లలేకపోతున్నారు. తగినన్ని బస్సులు నడపాలని పలు మార్లు విన్నవించినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని, దీంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. – పెళ్లకూరు

- సమయానికి బస్సులు లేక విద్యార్థుల ఇబ్బందులు
- వినతులు అందజేసినా పట్టించుకోని అధికారులు
- ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి



పెళ్లకూరు వద్ద ఆర్టీసీ బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

పెళ్లకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిల్లకూరు, జీలపాటూరు, చెంబడిపాళెం, దొడ్లవారిమిట్ట, వడ్డిపాళెం, కొత్తూరు, రావులపాడు, టింకాయతోపు తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారు ఉదయం 9 గంటలకు పాఠశాలకు చేరుకోవాల్సి ఉంది. అలాగే సాయంత్రం 4.50 గంటలకు పాఠశాల ముగియగానే తిరిగి ఇళ్లకు వెళతారు. ఆయా సమయాల్లో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి పుస్తకాల బ్యాగులు మోస్తూ రోడ్డుపై ఉంటున్నారు. ఉదయం వేళల్లో సరైన సమయానికి పాఠశాలకు చేరుకోలేక తరగతులు మిస్ అవుతున్నారు. సాయంత్రం సకాలంలో ఇళ్లకు వెళ్లలేకపోతున్నారు. అధిక చార్జీలు వెచ్చించి ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా నాయుడుపేట, శ్రీకాళహస్తి పట్టణాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రవాణా సదుపాయం లేక అనేక కష్టాలు పడుతున్నారు.

ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు

మండల కేంద్రమైన పెళ్లకూరు మీదుగా తిరుపతి, నెల్లూరు పట్టణాలకు పలు డిపో సర్వీసులు నడుస్తున్నాయి. గూడూరు డిపోకు చెందిన కొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు మాత్రమే ఆగుతున్నాయి. మిగిలిన శ్రీకాళహస్తి, తిరుపతి, రాపూరు, వెంకటగిరి, వాకాడు, ఆత్మకూరు, నెల్లూరు, సూళ్లూరుపేట డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఆగడం లేదు. 71వ నంబరు జాతీయ రహదారి పనులు జరుగుతుండడంతో పల్లెవెలుగు బస్సులు కూడా ఫ్లైఓవర్‌పై వెళుతున్నాయి. బస్సు ఎక్కాలన్నా, బస్సు దిగి ఇంటికి చేరుకోవాలన్నా కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి. సాయంత్రం 6.30 గంటలు దాటితే శ్రీకాళహస్తి నుంచి నాయుడుపేట వైపు పల్లెలకు వెళ్లాలంటే ఒక్క బస్సు కూడా లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీకాళహస్తి డిపో రద్దుతో కష్టాలు మొదలు

శ్రీకాళహస్తి–నాయుడుపేట పట్టణాల మధ్య శ్రీకాళహస్తి డిపోకు చెందిన బస్సు సర్వీసులు నడుస్తుండేవి. ప్రతి రోజూ నాలుగు బస్సులు, ఐదు సర్వీసుల చొప్పున నడిపేవారు. అప్పట్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కావు. ఏడాది క్రితం శ్రీకాళహస్తి డిపోను రద్దు చేసి సూళ్లూరుపేట డిపోకు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి రెండు బస్సులను మాత్రమే నడుపుతున్నారు. దీంతో విద్యార్థులతోపాటు మండల కేంద్రానికి వచ్చి వెళ్లే ఉద్యోగులు, ప్రజలు తిప్పలు పడుతున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి (సైదాపురం) : కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, టీడీపీ నేతల రాజకీయ కక్ష సాధింపులకు భయపడొద్దని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయనను శనివారం వెంకటగిరిలోని తన నివాసంలో వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు కలిశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ వర్గీయులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని తెలిపారు. వాటిని కోర్టుల ద్వారా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు కందాటి కళ్యాణి, పూజారి లక్ష్మి, ఆరి శంకరయ్య, పులి ప్రసాద్ రెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, బాబి, వెందోటి కార్తీక్‌రెడ్డి, కందాటి రాజారెడ్డి, యస్థాని, రొంటాల చిన్నా, మేరువ సురేంద్ర, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌బాబు, సీహెచ్ మురళీ, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు నేదురుమల్లి ఆశీర్వాదం

వెంకటగిరి(సైదాపురం)/రాపూరు: సైదాపురం మండలం మొలకలపూడ్లకు చెందిన వైఎస్సార్ సీపీ నేత కూకట్ వెంకటేశ్వర్లు కుమార్తె ప్రవళిక, శ్రీనివాసులు వివాహం శనివారం వెంకటగిరిలోని ఎస్ఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. అలాగే రాపూరు మండలం సిద్ధవరంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మూరంరెడ్డి రామిరెడ్డి కుమారుడు రాఘవేంద్రరెడ్డి, ప్రవళ్లికారెడ్డి వివాహం జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మన్నారపు రవికుమార్‌యాదవ్, రాపూరు దందోలు నారాయణరెడ్డి, నాయకులు కలపాటి మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.



సైదాపురం : నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి



రాపూరు : నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి, మేరిగ మురళీధర్

డేటా ఆపరేటర్‌పై విచారణ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట సివిల్ సప్లయీస్ గోడౌన్‌లో డేటా ఆపరేటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుపై శనివారం ఆ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. శ్రీనివాసులు రాత్రి సమయాల్లో గోడౌన్ వద్ద మద్యం సేవిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సివిల్ సప్లయీస్ జిల్లా గ్రేడ్–2 అధికారి ఎం.వెంకటేశ్వర్లు శనివారం సివిల్ సప్లయీస్ డీటీ జయసింహ సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విచారణలో తేలిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలి

వాకాడు : పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని ఎంపీపీ అనసూయమ్మ ముఖ్య ప్రతినిధి, వాకాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ అనసూయమ్మ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో అరాచకాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు ఇటీవల ఎస్ఎంసీ ఎన్నికల్లో కూటమి నేతల కుట్రలే నిదర్శనమన్నారు. అధికారులు పార్టీలకతీతంగా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీవీ రమణయ్య, తహసీల్దార్ రామయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా వెంకటయ్యస్వామి ఆరాధనోత్సవం



రాపూరు: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



కలువాయి: గోపూజ చేస్తున్న భక్తులు

రాపూరు/కలువాయి/తడ/బాలాయపల్లి(సైదాపురం): రాపూరు, కలువాయి, తడ, బాలాయపల్లి మండలాల్లో శనివారం వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 4 గంటలకు ధ్వనిపూజ, 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, 6 గంటలకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కోట: మండలంలోని కర్లపూడి సమీపంలో ఉన్న చల్ల కాలువ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం ఎస్ఐ పవన్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారంతో దాడులు చేశారు. వారి వద్ద అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భూసార యాజమాన్యంపై రైతులకు శిక్షణ

ఓజిలి: భూసార పరీక్షలు చేసుకుని పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఓజిలి ఆర్బీకేలో శనివారం భూసార యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ భూముల్లో ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడడం వల్ల పంటలకు మంచి చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట, జీవన ఎరువులు వాడకం వల్ల భూమిలో జీవాన్ని పెంచవచ్చన్నారు. వ్యవసాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ భూసార పరీక్షలను గ్రామస్థాయిలోనే రైతు సేవా కేంద్రాల్లోని విస్తరణ సిబ్బంది ద్వారా ఉచితంగా చేసుకోవచ్చని తెలిపారు. ఉద్యానవన అధికారిణి శారద మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, వ్యవసాధికారి వేణుగోపాలరావు, సిబ్బంది భావన తదితరులు పాల్గొన్నారు.

భూముల సర్వేపై అభ్యంతరాలు తెలపండి

కోట/చిల్లకూరు: చిల్లకూరు మండలం కొత్తపట్నం పంచాయతీలో భూసర్వేను పారదర్శకంగా చేపట్టామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం కొత్తపట్నం సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కోస్టల్ కారిడార్ భూములకు సంబంధించి 441 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులను గుర్తించేందుకు సర్వే చేపట్టామన్నారు. అలాగే చిల్లకూరు: తీరప్రాంతంలో కోస్టల్ కారిడార్ కోసం సేకరించిన భూముల సాగుదారుల జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. తమ్మినపట్నం వద్ద శనివారం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలోని ఏడు గ్రామాల పరిధిలో 914 ఎకరాల భూములను ఏపీఐఐసీ ద్వారా సేకరించామన్నారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, తహసీల్దార్లు శ్రీనివాసులు, జయజయరావు, సర్పంచులు నాశిన సుబ్రమణ్యం, నెల్లిపూడి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎన్నిక వాయిదాపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

చిట్టమూరు(చిల్లకూరు) : అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఎస్ఎంసీ ఎన్నికను వాయిదా వేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యాకసిరి పాఠశాలలో శనివారం అధికారులు ఎస్ఎంసీ ఎన్నిక ప్రక్రియను మూడో పర్యాయం చేపట్టారు. ఇక్కడ వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ఎక్కువగా ఉండడంతో టీడీపీ నేతల ఒత్తిడి మేరకు కోరం లేదని వాయిదా వేశారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. పిల్లలను తీసుకుని బాయ్‌కాట్ చేశారు. కోరం లేకపోవడంతోనే ఎన్నికను వాయిదా వేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

ఎట్టకేలకు ఎస్ఎంసీ ఎన్నిక

చిల్లకూరు : ఓడూరు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఎట్టకేలకు ఎస్ఎంసీ ఎన్నికను చేపట్టారు. గతంలో అధికార పార్టీ నేతల ఒత్తిడితో రెండు సార్లు ఎన్నికలను వాయిదా వేశారు. శనివారం నిర్వహించిన ఎన్నిక ప్రక్రియలో 24 మంది తల్లిదండ్రుల్లో 14 మంది వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు మద్దతు తెలిపారు. చైర్‌పర్సన్‌గా వెందోటి మమత, వైస్ చైర్మన్‌గా ఆవుల చెంచయ్య ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు. వారిని సర్పంచ్ శారదమ్మ సత్కరించారు.

ఖగోళంపై అవగాహన కలిగి ఉండాలి

గూడూరు రూరల్ : విద్యార్థులు ఖగోళంపై అవగాహన కలిగి ఉండాలని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. జాతీయ అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా శనివారం గూడూరు డీఆర్‌డబ్ల్యూ కళాశాల విద్యార్థులు చంద్రయాన్–3 విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన ఆలోచనలే మన విజయాలకు పునాది అని తెలిపారు. కార్యక్రమంలో షార్ పూర్వ శాస్త్రవేత్త విశ్వనాథ్‌శర్మ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మాధవి, డిప్యూటీ డీఈవో శాంతి, సీడీపీవో మెహబూబీ, డీఆర్ డబ్ల్యూ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నిరసన



సూళ్లూరుపేట రూరల్ : కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు డిమాండ్ చేశారు. వారు శనివారం ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శర్మ ఆధ్వర్యంలో కళాశాల వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన రవి

ఓజిలి: జాతీయ రహదారిపై రాజుపాళెం వద్ద లారీ ఢీకొని జీ.రవి(35) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఓజిలి బీసీ కాలనీకి చెందిన గోనుపల్లి రవి శనివారం పెట్రోల్ కోసం రాజుపాళెంలో బంక్ వద్దకు బైక్‌లో బయలుదేరాడు. అదే సమయంలో డీజిల్ పట్టుకుని రాంగ్ రూట్‌లో వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రవి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రవిబాబు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.